ఆయన మంచితనాన్ని మనసులోనే అభినందించుకుంటూ విశ్వేశ్వరరావు సకాలంలోనే రైల్వేస్టేషన్‌కు వెళ్ళగలిగాడు. ట్రైన్ టైముకే వచ్చింది. భార్య మాలతిని ఆమె అమ్మగారు తీసుకువచ్చింది. ట్రెయిన్లో తల్లి పక్కన కూర్చుని అంతసేపూ తనవైపే ఓరచూపులు చూస్తూ తనుచూడగానే ముడుచుకుపోయిన మాలతిని చూడగానే విశ్వేశ్వరరావు శరీరం పులకించింది. నా భార్య అందమైనది కావడం అదృష్టం అనుకున్నాడతను.

విశ్వేశ్వరరావు అత్తగారక్కడ ముచ్చటగా మూడు రోజులు మాత్రం ఉండి అంతకంటే ఎక్కువ కాలం ఉండడం అప్పట్లో వాంఛనీయం కాదనుకొని వెళ్ళిపోయింది. ఆవిడ వెళ్ళిపోయాక కొన్నాళ్ళపాటు ఆ దంపతులు ఆ ఇంట్లో స్వేచ్ఛా విహారంచేశారు. ఒక నెల రోజులపాటు ఇతరములైన మాటలు మరిచిపోయి ఒకరినొకరు పొగుడుకుంటూ కాలం గడిపేశారు.

ఒకరి నొకరు పొగుడు కోవడం అయ్యాక ఆ పద్ధతి బోరు కొట్టినట్టయింది. మరో నెలపాటు వారు తమను తాము పొగుడుకున్నారు. కాలేజీలో చదువుకునే రోజుల్లో తనెటువంటి ఘనకార్యాలు చేశాడో, ఇప్పుడు కాలేజీలో అంతా తననెలా గౌరవిస్తారో వివరించి విశ్వేశ్వరరావు చెప్పగా - చిన్నప్పట్నించీ తన అందానికీ, నడవడికకూ, వంటకూ, తెలివి తేటలకూ ఎంద రెందరు సర్టిఫికెట్లిచ్చారో మాలతి చెప్పుకుంది.

అప్పటికి ఒకర్నొకరు మెచ్చుకోవడం అయింది. స్వంత డబ్బాలువాయించుకోవడం అయింది. ఇంక నిజజీవితం ప్రారంభమైంది. విశ్వేశ్వరరావుకి తన ఆశయాలమలు జరిపే అవకాశం అప్పటికి ఏర్పడింది. అతను ఒక సాయంత్రమల్లా భార్యను కూర్చోబెట్టి ఆ ఇంటికి ఆమె రాణి అనీ, రాజును కూడా శాసించగల అధికారం కలిగినదనీ చెప్పాడు.

"అంటే నేనేం చేయాలి?"

"రేపు నీకో పర్సు కొనిపెడతాను. నా దగ్గరున్న డబ్బంతా ఆ పర్సులో వేసేస్తాను. ఆ క్షణం నించీ డబ్బు పెత్తనమంతా నీది. నాకు పైసా కావాలన్నా నిన్నడిగి తీసుకోవాలి. నువ్వు మాత్రం ఆ డబ్బును నీకు తోచిన విధంగా ఖర్చు పెట్టుకోవచ్చు" అన్నాడు విశ్వేశ్వరరావు.

"అలాగా! అయితే ఇప్పుడు మీ దగ్గర డబ్బు ఏమాత్రం ఉన్నదేమిటి?" అంది మాలతి.

"ఇది నెల మధ్య కదా - అందువల్ల నూట యాభై రూపాయలు మాత్రమే ఉంది. పర్సు కొన్నాక అది నూరులోపే అవుతుంది" అన్నాడు విశ్వేశ్వరరావు.

"అయితే ఎలా? ఒక్క చీరకొంటేనే అయిపోతుంది. అప్పుడుమీరుమళ్ళీ డబ్బిస్తారా?" అంది మాలతి.

"బాగుంది. నీకు డబ్బిచ్చేది చీర కొనుక్కుందుకా?" అన్నాడు విశ్వేశ్వరరావు.

"మరి నాకిష్టమొచ్చినట్టు ఖర్చు చెయొచ్చన్నారుగా - అన్నింటికంటే నాకు చీరలే ఇష్టం" అంది మాలతి.

విశ్వేశ్వరరావు భార్యవంక ముచ్చటగా చూసి "నువ్వు చాలా అమాయకురాలివి. అందుకే నీకు బాధ్యతలప్పగించాలనుకుంటున్నాను. నెల ఆరంభంలో మనం నిలవేయాలనుకున్న డబ్బు కాస్త తీసేసి ఇంటి ఖర్చులకు సరిపడా దగ్గరుంచుకుంటాం. అదంతా నీ దగ్గరే ఉంటుంది. అది నీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేయొచ్చు కానీ ఇంట్లో ఏ లోటూ రాకూడదు. ఎక్కడా అప్పు చెయ్యకూడదు. నన్ను ఎక్స్‌ట్రా డబ్బు ఆడక్కూడదు. ఏమైనా మిగిలితే అంతా నీదే" అన్నాడు.

మాలతికీ పద్ధతి బాగానే ఉందనిపించింది. ఒకనెల రోజులపాటు ఇంటి ఖర్చుల విషయంలో భర్త దగ్గర శిక్షణ పొందింది. వాళ్ళకు ముఖ్యమైన ఇంటి ఖర్చులు అపరాలు, పాలు, పేపరు, పుస్తకాలు, గ్యాసు, సినిమాలు, విశ్వేశ్వరరావు ఆఫీసుకెళ్ళి రావడానికయ్యే బస్సు ఖర్చు. వీటన్నింటికీ వివరంగా బడ్జెట్ వేసి అందుకెంత అవుతుందో చూసుకుని దానికో యాభై కలిపి అంత డబ్బు మాసారంభంలో మాలతికిచ్చేవాడు విశ్వేశ్వరరావు. నెల పొడుగునా ఆ డబ్బునుపొదుపుగా ఖర్చు చేసి కొంత మిగిల్చేది కూడా మాలతి.

ఈ విధంగా రెండు నెలలుగడిచాక మాలతికి అనుభవం వచ్చేసింది.

ఒక రోజున మాలతికెంతో ఇష్టమై చూడలేకపోయిన ఒక పాత సినిమా ఒక థియేటర్లో ఒకే ఒక్క మ్యాట్నీ షోగా వచ్చింది. మాలతి ఆ విషయం భర్తకు చెప్పింది.

"దానికేముందీ - వెళ్ళు!" అన్నాడు విశ్వేశ్వరరావు.

"అలా కాదండీ! సినిమా చూస్తే మనం కలిసే చూడాలి. లేకపోతే మానేయాలి - అంతే!" అంది మాలతి ముద్దుగా.

"మరి నాకు సెలవులు లేవే?" అన్నాడు విశ్వేశ్వరరావు.

"అయితే సరేలెండి-" అని ఊరుకుంది మాలతి. ఆమె ముఖంలో కోపం లేదు కానీ నిరుత్సాహం మాత్రం ఉందని విశ్వేశ్వరరావు గ్రహించాడు. అతని మనసు చివుక్కుమంది.

కాలేజికి వెళ్ళాక అతను పరమానందానికి యథాలాపంగా చెప్పినట్లుగా భార్య కోరిక చెప్పాడు. పరమానందం అది విని - "నీ ఆవిడ కోరిక తీర్చాలని ఉందా?" అన్నాడు.

"మీరు పర్మిషనిస్తే!" అన్నాడు విశ్వేశ్వరరావు.

"నీకు మధ్యాహ్నం లెక్చర్లయినా, ప్రయివేట్ క్లాస్‌లైనా ఉన్నాయా?"

"లేవండి-" అన్నాడు విశ్వేశ్వరరావు వినయంగా.

"అయితే నా పర్మిషనెందుకు? కొత్త పెళ్ళికొడుకువి. నీకడ్డమేమిటి? వెళ్ళు" అని ప్రోత్సహించాడు పరమానందం.

విశ్వేశ్వరరావు బాస్‌కు మనసులో కూడా ధన్యవాదాలర్పించుకుని ఇంటికి వెళ్ళే సరికి మాలతి ఆశ్చర్యపోయి - "నా కోసం సెలవు పెట్టేశారా?" అంది.

"లేదు. నా బాస్ ఎంత మంచివాడనుకున్నావ్? క్లాసులు లేకపోతే నేను వెళ్ళి పోవడానికి తనను పర్మిషన్ కూడా అడగక్కర్లేదంటాడు. అవసరమైనప్పుడు రాత్రిళ్ళు

కూడా ఉండి పనిచేస్తుంటాం. దానికి మాకు ఓవర్‌టైమూ, కాంపెన్సేటరీ హాలీడేసూ ఉండవు. అందుకని ఇలా చూసీ చూడనట్లూరుకుంటారు. అయినా మా బాస్ వేరనుకో!" అంటూ అతను తన బాస్ గురించి చెప్పాడు.

"మీ బాస్ అయినా అందరితో అలా ఉంటారనుకోకండి - ఒక్కొక్కరి ముఖార విందం, మిమ్మల్ని చూస్తుంటే ఎంత అమాయకంగా ఉంటారనుకొన్నారు? ఏ బాస్ అయినా మీతో అలాగే ఉంటారనుకుంటున్నాను" అంది మాలతి.

ఆ క్షణంలో విశ్వేశ్వరరావు నిజంగానే అమాయకుడైపోయాడు. అతను రెట్టించిన ఉత్సాహంతో ఆమెతో సినిమాకు వెళ్ళి చూసి ఆనందించాడు.

ఆ తర్వాత రెండురోజులకు మాలతి భర్తతో "బజార్లోకి కొత్త మోడల్ జోళ్లు వచ్చాయండీ - నా జోళ్ళు బాగా పాతవైపోయాయి. కొనుక్కుందామనుకుంటున్నానండీ" అంది.

"వాటి ఖరీదు ఎంతుంటేందిమిటి?". అన్నాడు విశ్వేశ్వరరావు.

"ముప్ఫై అయిదు రూపాయలు" అంది మాలతి.

"మన దగ్గర డబ్బెంతుంది?"

డెబ్భై రెండు రూపాయల చిల్లర ఉంది. ఈ నెలకింక రెండు రోజులే ఉన్నాయి."

విశ్వేశ్వరరావు సంతృప్తిగా నవ్వి "డబ్బుండి నెల గడవడానికిబ్బంది లేకపోతే నన్నడగక్కరల్లేదు. నీకు నచ్చినదేమైనా ముందు కొనేసుకుని అప్పుడు నాకు చూపిస్తే సంతోషిస్తాను" అన్నాడు.

"మీరెంత మంచివారండీ" అంది మాలతి అతని కళ్ళలోకి ప్రేమగా చూస్తూ.

"మంచితనం నాదికాదు. నీ అమాయకమైన ముఖం చూస్తూ నువ్వడిగినది కాదనడం కష్టం. నీ భర్త స్థానంలో నేను కాదు మరెవరున్నా అలాగే అంటారు" అన్నాడు విశ్వేశ్వరరావు.

ఆమెను అమాయకురాలిగా అభివర్ణించినా ఆ క్షణంలో కూడా అమాయకుడైనది తనేనని అతనికి తెలియదు. ఆ రోజే వెళ్ళి భార్య ఆ చెప్పులు కొని తొడుక్కుని సంబర పడుతూంటే అని మనసు ఆకాశానికి ఎగిరిపోయింది.

తన బాస్ ఇచ్చే చనువును దుర్వినియోగం చేసుకునేవాడు కాదు విశ్వేశ్వరరావు. తన భర్త తనకిచ్చిన అధికారాన్ని సక్రమంగా వినియోగించుకునేది మాలతి. ఎప్పుడో తప్ప పర్మిషన్ అడగని విశ్వేశ్వరరావుకు సంతోషంగా పర్మిషన్ ఇచ్చేవాడు పరమానందం. ఎప్పుడో తప్ప తనకిది కొనమని అడగని భార్యకు కోరినది వెంటనే తీర్చేవాడు విశ్వేశ్వరరావు.

ఒకరోజు కాలేజిలో ఉండగా విశ్వేశ్వరరావుకు భరించరాని తలనొప్పి వచ్చింది. అతనికా రోజు ఒక క్లాసు కూడా లేదు. అయినా మధ్యాహ్నం వరకూ ఎలాగో ఉన్నాడు. ఇంక తట్టుకోలేక వెళ్ళిపోదామనుకుని పరమానందం గదికి వెళ్ళాడు. ఆయన అప్పుడే క్లాసుకు వెళ్ళారుట.

విశ్వేశ్వరరావు క్షణం ఆలోచించాడు. తన చీటి వ్రాసి టేబుల్ మీద పెడితే ఇంకెవరైనా చూడవచ్చు. తను వెళ్ళిపోతున్నట్లు వ్రాతపూర్వకమైన ఆధారమేదీ ఉండరాదు. క్లాసులు లేకపోతేసరి నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చునని ఆయనే పదిసార్లు చెప్పాడు. తలనొప్పి భరించరానిదిగా ఉంది.ఆయన రావడానికింకా ముప్పావుగంట పడుతుంది.

విశ్వేశ్వరరావు తెగించి ఇంటికివెళ్ళిపోయాడు. ఆమాత్రం చనువుపయోగించు కోకపోతే బాస్ మంచితనానికి అర్థమేమిటని కూడా అనుకున్నాడు.

ఇంటికి రాగానే అతన్ని చూసి ఆశ్చర్యపోయింది మాలతి. అప్పటికప్పుడు కాఫీ కలిపి అతనికిచ్చింది - భార్య చేతి కాఫీ తాగేక విశ్వేశ్వరరావుకి తలనొప్పి తగ్గినట్లనిపించింది.

"ఈవేళ నిజంగానే మీ ఒంట్లో బాగోలేదు. మీ చేతిలోని కొత్త వస్తువును కూడా గమనించలేని స్థితిలో ఉన్నారు" అంది మాలతి నవ్వుతూ.

విశ్వేశ్వరరావులిక్కిపడి తన చేతిలోని వస్తువు వంక చూశాడు. అది కాఫీ కప్పు. పింగాణీది. ఆ వస్తువు ఇంతవరకూ తమ యింట్లో లేదు. "ఇదెక్కడిది?" అన్నాడు.

"కొన్నాను" అంది మాలతి. "ఉదయం ఇవి తీసుకుని ఒకడొచ్చాడు. ఈ కప్పుల సెట్టు చాలామందిని ఆకర్షించింది. సాయంత్రం వస్తావా అని అడిగాను. ఇంక రానన్నాడు. వీధిలో చాలామంది కొనుక్కున్నారు. ఆరు కప్పులూ, సాసర్లు ముప్ఫై అయిదు రూపాయలు చెప్పి ఇరవై ఒక్క రూపాయలకిచ్చాడు. మిమ్మల్నడిగే అవకాశం లేకపోయింది. కప్పులు బాగున్నాయి కదండీ".

"బాగున్నాయా అని ఇప్పుడడగడమెందుకూ? కొనేముందు అడిగితే చెప్పేవాణ్ణి. ఈ ముష్టి కప్పుల కోసం ఇరవై ఒక్క రూపాయలు వృధా! అయినా మనకిప్పుడు కప్పుల గురించి అంత అర్జంటేముంది? ఇలా అడ్డమైన సరుకులూ కొనుక్కుపోతూంటే మనం డబ్బెప్పటికి నిలవేస్తాం? మంచి ఫర్నీచరుకెప్పటికి ఆర్డరిస్తాం" అన్నాడు విశ్వేశ్వరరావు.

భర్త ఎంతో మెచ్చుకుంటాడని ఆశించిన మాలతి నివ్వెరపోయింది. భర్త కోపం అలవాటు లేక ఆమె కళ్ళలో నీళ్ళు కూడా తిరిగాయి.

ఆ తర్వాత ఆ రోజల్లా విశ్వేశ్వరరావు ఆమె చేసిన ఆ ఖర్చును విమర్శిస్తూనే ఉన్నాడు. తనుఎంతో తెలివైనదిగా భావించిన మాలతి అంత పొరపాటెలా చేసిందో అర్థం కావడం లేదన్నాడు. ఈ నష్టాన్ని పూడ్చుకోవడంకోసం తను ఆఫీసుకు నడిచి వెడతానన్నాడు. సినిమాలు మానేస్తానన్నాడు. ఆమె మనసుకు కష్టం కలిగించే మాటలు చాలాచాలా అన్నాడు.

రాత్రికి అతను మామూలు మనిషి అయినప్పటికీ మాలతిని క్షమాపణ అడగలేదు "ఇంకెప్పుడూ ఇలాంటి ఖర్చులు చేయకు" అని మాత్రం ఆమెను హెచ్చరించాడు.

మర్నాడు సాయంత్రం విశ్వేశ్వరరావు ఆఫీసునించి తిరిగి వచ్చేసరికి బాగా చిన్నబోయి ఉన్న అతని ముఖం చూసి "అదేమండీ! అలా ఉన్నారు, మళ్ళీతలనొప్పి వచ్చిందా?" అనడిగింది మాలతి అభిమానంగా.

"లేదు" అంటూ కుర్చీలో కూలబడి "ఈ వెధవ బాస్‌లున్నారే వీళ్ళని నమ్మకూడదు. నవ్వుతూ మాట్లాడుతూనే వెనకాల గోతులు తీస్తారు..." అన్నాడు.

"ఏం జరిగిందండీ?" అంది మాలతి.

"ఏముంది. నిన్న నేను పరమానందానికి చెప్పకుండా ఇంటికి వచ్చాను. అసలు చెప్పేద్దామనుకున్నాను. ఆ సమయానికి ఆయన క్లాసులో ఉన్నాడు. నేను తలనొప్పి భరించలేకపోతున్నాను. క్లాసు లేకపోతే తనకు చెప్పకుండానే వెళ్ళొచ్చునన్నాడు గదా అన్న ధీమాతో ఇంటికి బయల్దేరి వచ్చేశాను. ఈ వేళ ఆ విషయం చెప్పగానే నవ్వుతున్న వాడల్లా ముఖం సీరియస్‌గా పెట్టేశాడు. నేను కుర్రాణ్ణి కాదుట. బాధ్యతగల ఉద్యోగినట. మున్ముందింకా పైకి రావలసిన వాణ్ణట. ఇలా చెప్పా చెయ్యకుండా వెళ్ళిపోతుంటే కెరీర్ దెబ్బతింటుందిట. ఏ ప్రిన్సిపాల్ అయినా స్టాఫ్ మీటింగ్ పెడితే అసలు తన సబార్డినేట్స్ ఏమయ్యారో ఎక్కడున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత తనదట. నేనలా బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే కొంపలు మునిగిపోతాయట. నిన్న ప్రిన్సిపాల్ స్టాఫ్ మీటింగ్ పెట్టాలనే అనుకున్నాడట. కానీ ఆయన తెలివిగా వాయిదా వేయించేశాట్ట. నా మూలంగా తను చాలాపెద్ద ఇబ్బందిలో పడి పోయేవాడుట. నా గురించి మిగతా స్టాఫ్‌లో కూడా క్రమశిక్షణ చెడిపోతుందిట. ఇలా ఒకటేమిటి లక్ష రకాలుగా తిట్టాడు.వాణ్ణి నమ్మినందుకు నాకు తగిన శాస్తి అయింది..." అన్నాడు విశ్వేశ్వరరావు. బాస్ మాటలకు కలిగిన అవమానం అతని ముఖమంతా ఇంకా ఆవరించుకునే ఉంది.

ఆ రాత్రి మాలతి అతనితో మాట్లాడుతూ "నాకో సరదా ఉంది. ఒప్పుకుంటారా?" అంది.

"చెప్పు!" అన్నాడు విశ్వేశ్వరరావు. "మిమ్మల్ని బాస్ అని పిలవాలని ఉంది" అంది మాలతి నెమ్మదిగా.

ఆ మాటలకు విశ్వేశ్వరరావు ఏమనుకున్నాడో తెలియదు కానీ అతని డబ్బంతా మాలతి పర్సులోనే ఉండడమూ, పరమానందం అతన్ని ఆప్యాయంగా పలకరించడమూ ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

మాలతి మాత్రం ఇప్పుడు అతన్ని రోజూ "బాస్!" అని పిలుస్తూంటుంది.

✦ ✦ ✦